## క్లుప్తంగా

### బీసీ భవనాన్ని ప్రారంభించాలి

**మిర్యాలగూడ టౌన్:** మిర్యాలగూడ పట్టణంలో నిర్మించిన మహాత్మా జ్యోతిరావ్ పూలే బీసీ భవన నిర్మాణ పనులు పూర్తి చేసి, తక్షణమే ప్రారంభించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు తిరుమలగిరి అశోక్ కోరారు. బుధవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారిలో శ్రీనివాస్, నర్సింహ, మురళీయాదవ్, నరేష్, గంగాధర్, లింగయ్య, శివమణి, అనిల్, కళ్యాణ్, సురేష్ తదితరులున్నారు.

### ఉచిత బస్సు ప్రయాణంపై పునరాలోచించాలి

**మిర్యాలగూడ టౌన్:** ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై పునరాలోచన చేయాలని స్టేట్ ఆటో అండ్ ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం స్థానికంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉచిత బస్సు ప్రయాణంతో తాము ఉపాధి కోల్పోయామని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు.

### చేనేతల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి కొండా సురేఖను సన్మానిస్తున్న రావిరాల శ్రీలత, సునీత

**నిడమనూరు:** రాష్ట్ర అటవీ శాఖ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను నిడమనూరు మండలానికి చెందిన జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రావిరాల శ్రీలత బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి పత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆమె వెంట జాతీయ చేనేత ఐక్య వేదిక తెలంగాణ అధికార ప్రతినిధి పోషం సునీత ఉన్నారు.

### దిలావర్‌పూర్‌కు ఆర్టీసీ బస్సు నడపాలి



ఆర్టీసీ డిపో మేనేజర్ పాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న బెజ్జం సాయి

**మిర్యాలగూడ:** దామరచర్ల మండలంలోని దిలావర్‌పూర్ గ్రామానికి నుంచి ఆర్టీసీ బస్సు నడపాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జం సాయి కోరారు. ఈమేరకు బుధవారం మిర్యాలగూడలో ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్‌కు వినతిపత్రం అందజేశారు.

### 30న ఉచిత వైద్యశిబిరం

**తిరుమలగిరి(నాగార్జునసాగర్):** మండలంలోని నెల్లికల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 30న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నాట్కో ట్రస్ట్ ప్రతినిధి జీఎల్‌ఎన్‌రావు బుధవారం తెలిపారు. స్త్రీల ప్రసూతి వైద్య నిపుణులు, పిల్లలు, ఎముకలు, మానసిక వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

### శేఖర్‌రెడ్డికి ఎమ్మెల్సీ పరామర్శ



శేఖర్‌రెడ్డిని పరామర్శిస్తున్న కోటిరెడ్డి

**మాడుగులపల్లి :** ఆర్టీఐ మాజీ కమిషనర్ కట్టా శేఖర్‌రెడ్డి మాతృమూర్తి జానమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మర్రిగూడెంలోని శేఖర్‌రెడ్డి నివాసంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి ఆయనను పరామర్శించారు. జానమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వెనిగండ్ల పీఏసీఎస్ చైర్మన్ కేవీరావు, కట్టా సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

### నూతన వేతన ఒప్పందం చేయాలని వినతి

**నల్లగొండ:** విశాఖ ఇండస్ట్రీస్ లిమిటెడ్ యాజమాన్యం నూతన వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఐఎన్‌టీయూసీ, జిల్లా కార్యవర్గం విశాఖ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్‌ల ఆధ్వర్యంలో నల్లగొండ కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొయినుద్దీన్ పాల్గొని మాట్లాడుతూ యాజమాన్యం 2020 సంవత్సరంలో చేసుకున్న వేతన ఒప్పందం 2023తో ముగిసిందని, నూతన ఒప్పందం చేయాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందని తెలిపారు. అనంతరం కార్మిక శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా చీఫ్ వైస్ ప్రెసిడెంట్ జమాలుద్దీన్ జిలాని, కోటగిరి శేఖర్, నూకపంగ రమేష్, షేక్ ఖలీల్, దూదిమెట్ల సందీప్, విజయ్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన పకడ్బందీగా నిర్వహించాలి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

**పెద్దఅడిశర్లపల్లి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనను సమర్థవంతంగా నిర్వహించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల పథకాలు పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో దేవరకొండ ఎంపీడీఓ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ జాన్‌యాదవ్, డీఎస్పీ గిరిబాబు, మున్సిఫల్ కమిషనర్ వెంకటయ్య, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



దేవరకొండలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**పోలీస్ ఎస్కార్ట్ వద్దు..**

ప్రజాపాలన కార్యక్రమం పూర్తయ్యే వరకు తనకు పోలీస్ ఎస్కార్ట్ అవసరం లేదని ఎమ్మెల్యే బాలునాయక్ దేవరకొండ డీఎస్పీకి తెలిపారు. ప్రజాపాలన నేపథ్యంలో నియోజకవర్గంలోని గ్రామాల్లో పోలీసులు పకడ్బందీగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

**హమీలను నెరవేర్చాలనే ఉద్దేశంతోనే..**

**త్రిపురారం :** ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హమీలను నెరవేర్చాలనే ఉద్దేశంతో నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అనుముల పాండమ్మ కోరారు. బుధవారం త్రిపురారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యులకు దరఖాస్తు నింపడంలో సిబ్బంది సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలు మంగమ్మ, ఎంపీఓ భిక్షం రాజ్, సూపరింటెండెంట్ సత్యప్రభ, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**దరఖాస్తులు అందజేయాలి**

**అడవిదేవులపల్లి:** 28వ తేదీ నుంచి ప్రజాపాలన నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ మహ్మద్ షరీఫ్ అన్నారు. బుధవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 28న గోన్యతండా, 29న ఉల్సాయిపాలెం, 30న అడవిదేవులపల్లి, జనవరి 2న ముదిమాణిక్యం, బంగారికుంటతండలో, 3న చాంప్లాతండా, చిట్యాల, 4న జిలకరకుంటతండా, కొత్తనందికొండ, 5న నల్లమెట్లతండా, నడిగడ్డ, ముదిమాణిక్యం, 6న బాల్నేపల్లిలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

**నేటి నుంచి గ్రామసభలు**

**చందంపేట:** ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా చందంపేట, నేరెడుగొమ్ము మండలాల్లో గురువారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓలు రాములునాయక్, ఝాన్సీ లక్ష్మీబాయి తెలిపారు. బుధవారం చందంపేట, నేరెడుగొమ్ము ఎంపీడీఓ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు.

మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు పార్వతిచందునాయక్, బాణావత్ పద్మ, జెడ్పీటీసీలు నేనావత్ బుజ్జి లచ్చిరాం, కేతావత్ బాలునాయక్, ఎంపీఓలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

**ప్రజాపాలనపై మండల స్థాయి సమీక్ష**

**పెద్దవూర:** ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన సభలను పకడ్బందీగా నిర్వహించి, లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పెద్దవూర మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీఓ విజయకుమారి, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

**గ్రామసభల ద్వారా దరఖాస్తుల స్వీకరణ**

**నిడమనూరు:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాలకు సంబంధించి గ్రామసభల ద్వారా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రాజ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన గ్రామ సభల నిర్వహణ, దరఖాస్తుల స్వీకరణ గురించి వారికి వివరించారు. సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ ప్రతాప్ నాయక్, ఎంపీపీ బొల్లం జయమ్మ, జెడ్పీటీసీ నందికొండ రామేశ్వరి, ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, బొక్కమంతులపాడ్ సర్పంచ్ పిల్లి రమేష్ పాల్గొన్నారు.

**ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి**

**హాలియా :** అనుముల మండలంలో గురువారం నుంచి జనవరి 6 వరకు జరిగే ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్, పీడీ రాజ్‌కుమార్, అనుముల ఎంపీపీ పేర్ల సుమతీపురుషోత్తం కోరారు. బుధవారం పట్టణంలోని రైతు వేదిక, మండల పరిషత్ కార్యాలయంలో వేర్వేరుగా నిర్వహించిన సమీక్ష సమావేశం వారు మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, వైస్ ఎంపీపీ మాలే అరుణ, ఎంపీడీఓ లక్ష్మి, తహసీల్దార్ జయశ్రీ, ఎంపీఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రజాపాలన కార్యక్రమంపై మున్సిపల్ కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులు, అంగన్‌వాడీ, మెప్మా, ఆర్‌సీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కౌన్సిలర్లు చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

**అర్హులందరి నుంచి స్వీకరించాలి**

**మాడుగులపల్లి :** గ్రామసభల్లో అర్హులందరి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఎంపీపీ శ్రీవిద్యారాజు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమ విజయవంతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, డీఈఓ భిక్షపతి, ఎంపీడీఓ దండ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ రవికుమార్, ఏఓ సైదానాయక్, ఆర్‌ఐలు అక్తర్ అలీ, రేణుక, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**పారదర్శకంగా ఉండాలి**



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

**మిర్యాలగూడ టౌన్:** ప్రజాపాలన కార్యక్రమం పాదర్శకంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కరుణాకర్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ సాయి ఆదిత్య, మున్సిపల్ డీఈ సాయిలక్ష్మి, హసింబాబా, ఆర్‌ఓ కల్యాణి, టీపీఓ సోమయ్య, మెప్మా టీఎంసీ పాతేపాక బక్కయ్య, సీఓలు శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు, పర్యావరణ పరిరక్షణ అధికారిని శ్వేతారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తదితరులున్నారు.



త్రిపురారం: అధికారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ అలివేలు మంగమ్మ



చందంపేట: మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములునాయక్



పెద్దవూరలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు

# పథకాల లబ్ధికి ప్రత్యేక దరఖాస్తులు

- నేటి నుంచి వచ్చే నెల 6 వరకు స్వీకరణ

**మిర్యాలగూడ టౌన్:** సంక్షేమ పథకాల లబ్ధి, కొత్త రేషన్ కార్డుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గురువారం నుంచి ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మిర్యాలగూడ మున్సిపాలిటీలోని ప్రతి వార్డుల్లో మున్సిపల్ అధికారుల నేతృత్వంలో 48 వార్డులకు గాను 16 టీంలను ఏర్పాటు చేశారు. ప్రతి వార్డులో సభలను నిర్వహించనున్నారు. గ్రామ సభల పర్యవేక్షణ మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ చూడనున్నారు.

**గ్రామ సభల షెడ్యూల్ ఇలా..**

**చింతపల్లి:** చింతపల్లి మండలంలోని దేన్యతండా, జర్పులతండా, ప్రశాంతపురితండా, పాలెంతండా 28వ తేదీన ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శంషొద్దీన్ తెలిపారు. 29న మదనాపురం, మల్లారెడ్డిపల్లి, తక్కెళ్లపల్లి, తిరుమలాపురం, 30న ధైర్యపురితండా, కుర్మేడు, తీదేడు, వర్కాల, జనవరి 2న చాకలిశేరిపల్లి, గడియగౌరారం, గొల్లపల్లి, కిష్టరాయినిపల్లి, 3న గొడుకొండ్ల, హరిజనాపురం, హోమంతాలపల్లి, పోలేపల్లిరాంనగర్, 4న చింతపల్లి, కుర్రంపల్లి,సర్లపల్లి, ఉప్పరపల్లి, 5న మొద్దులమల్లేపల్లి, నెల్వలపల్లి, రాయినిగూడెం, రోటిగడ్డతండా, సాయిరెడ్డిగూడెం, వింజమూరు,త 6న బోటిమీదితండా, బోత్యతండాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

**వేములపల్లి మండలంలో..**

**వేములపల్లి:** గ్యారంటీ హామీలకు సంబంధించి ప్రజాపాలన కార్యక్రమంలో లబ్ధిదారులు దరఖాస్తులు సమర్పించాలని ఎంపీపీ పుట్టల సునీత కోరారు. బుధవారం వేములపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. గురువారం తిమ్మారెడ్డిగూడెం, 29న మంగాపురం, బుగ్గబావిగూడెం, 30న కామెపల్లి, లక్ష్మీదేవిగూడెం, జనవరి 2న మొల్కపట్నం, ఆమనగల్లు, 3న లక్ష్మీదేవిగూడెం, సల్కునూరు, 4న వేములపల్లి, శెట్టిపాలెంలో గ్రామసభలు ఉంటాయని తెలిపారు.

**హాలియా మండలంలో..**

**హాలియా :** హాలియా మండలంలోని హజారిగూడెం, కొత్తపల్లిలో 28న గ్రామ సభలు జరగనున్నాయి. 29న పంగవానికుంట, పంగవానికుంట తండా, నాయుడుపాలెం, 30న చల్మారెడ్డి గూడెం, కొట్టాల, మదారిగూడెం, వచ్చే నెల 2న చింతగూడెం, పేరూర్, రామడుగు, 3న కొర్రివేనిగూడెం, యాచారం, 4న మారేపల్లి, వీర్లగడ్డతండ, 5న అన్నారం, ముక్కమాల, పులిమామిడి, 6న పాలెం, శ్రీనాథపురం, తిమ్మాపురంలో గ్రామ సభలు జరగనున్నాయని అధికారులు తెలిపారు.

**గుర్రంపోడు మండలంలో..**

**గుర్రంపోడు:** మండలంలో గ్రామసభల ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుధాకర్ తెలిపారు. 28వ తేదీన బుడ్డరెడ్డిగూడెం, కాచారం, ఘాశీరాంతండా, పాశంవారిగూడెం, సుల్తాన్‌పురం, 29న ఎల్లమోనిగూడెం, వెంకటాపురం(కె), కొత్తలాపురం, మునీంఖాన్‌గూడెం, లక్ష్మీదేవిగూడెం, 30న చామలోనిబావి, కాల్వపల్లి, జూనూతుల, చింతగూడెం, ఆమలూరు, 2న బొల్లారం, నడికూడ, పల్లిపాడు, చామలేడు, జిన్నాయిచింత, 3న పోచంపల్లి, ఉట్లపల్లి, మొసంగి, మక్కపల్లి, మైలాపురం, 4న చేపూరు, పిట్టలగూడెం, ముల్కలపల్లి, తేనపల్లి, తేనపల్లితండా, 5న గుర్రంపోడు, కొప్పోలు, కోయగూరోనిబావి, 6న పాల్వాయి, తానేదార్‌పల్లి, వట్టికోడు, తెరాటిగూడెంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

**మాడుగులపల్లి మండలంలో ముగ్గురు సమన్వయ అధికారులు**

**మాడుగులపల్లి :** మాడుగులపల్లి మండలంలో ప్రజాపాలన కార్యక్రమ అమలుకు ముగ్గురు సమన్వయ అధికారులను నియమించారు. తహసీల్దార్ జమీరొద్దీన్, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ రవికుమార్ సభలను సమన్వయం చేయనున్నారు. గురువారం అభంగాపురం, గార్లకుంటపాలెం, గండ్రవానిగూడెంలో, 29న పాములపాడు, మాడుగులపల్లి, కుక్కడం, 30న ఆగామోత్కూర్, ఇందుగుల, తోపుచర్ల, జనవరి 2న చెరువుపల్లి, గురప్పగూడెం, మాచినపల్లి, 3న భీమనపల్లి, కల్వలపాలెం, ఇసుకబావిగూడెం, సీత్యాతండా, 4న బొమ్మకల్లు, పూసలపహాడ్, ధర్మపురం, 5న చిరుమర్తి, కన్నెకల్లు, గజలాపురం, 6న దాచారం, కొత్తగూడెం, కేశవాపురం, గోపాలపురం, పోరెడ్డిగూడెంలో గ్రామసభలు నిర్వహించనున్నారు.

## అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషిచేయాలి

- డీఈఓ భిక్షపతి

**మాడుగులపల్లి:** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని నల్లగొండ డీఈఓ భిక్షపతి సూచించారు. మాడుగులపల్లి మండలంలోని అభంగాపురం ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రతిభ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లల్లో కనీస భాషా, గణిత సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని తెలిపారు. రోజువారీగా ఉపాధ్యాయులు అభ్యసనా సామగ్రి, కృత్యాలు అందుబాటులో ఉంచాలని, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు నిత్యం వీటిని పక్కాగా పర్యవేక్షించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఈఓ వెంట ఎంఈఓ బాలాజీ నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.



విద్యార్థినితో పాఠం చదివిస్తున్న డీఈఓ భిక్షపతి

## సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

**వేములపల్లి:** మండల కేంద్రంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో బుధవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలను చర్చి ఎగ్జిక్యూటివ్ మెంబర్ పుట్టల ఇమ్మానియేల్, దైద జాన్సన్ ప్రారంభించారు. నాలుగు టీమ్‌లు పాల్గొనగా ప్రథమ బహుమతిని దైద విజయకుమార్ టీమ్ కైవసం చేసుకుంది. అశోక్‌కుమార్, అనిల్‌కుమార్, విజయ్‌కుమార్, రాకేష్, సందీప్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పుట్టల ఇమ్మానియేల్

## బీసీ రిజర్వేషన్ల బిల్లుపై గళం విప్పాలి

**మిర్యాలగూడ టౌన్:** బీసీ రిజర్వేషన్ల బిల్లుపై అసెంబ్లీలో గళం విప్పాలని, బీసీ సంక్షేమ భవనం కోసం మిర్యాలగూడ పట్టణంలో స్థలం కేటాయించాలని బీసీ సంఘాల నేతలు కోరారు. ఈమేరకు బుధవారం పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నివాసంలో ఆయనను కలిశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల సమగ్ర కులగణన నిర్వహించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీసీ సంఘం నేతలు అంకతి సత్యం, బంటు వెంకటేశ్వర్లు, జయమ్మ, నాగేశ్వర్‌రావు, దుర్గయ్య, ఉరిబండి శ్రీనివాస్ యాదవ్, సుధాకర్, తుకారం, సావిత్రి, రాములు గౌడ్, అశోక్, కృష్ణ తదితరులున్నారు.



ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నేతలు


## ఆర్థికసాయం అందజేత

**వేములపల్లి:** మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన బారి జగన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బాధిత కుటుంబసభ్యులను బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పేరెల్లి నగేష్ బుధవారం పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట ఉప సర్పంచ్ రెమడాల కరుణాకర్ రెడ్డి, కొమ్మనబోయిన మంగమ్మ, సైదులు, మహేష్, లింగయ్య, రణదీర్, ఆంజనేయులు రామచంద్రయ్య, సోమయ్య, తిరుపతయ్య, చంద్రయ్య, భాస్కర్, నాగయ్య, ప్రభాకర్, వెంకటరమణ, ఎల్లయ్య, అశోక్, వెంకన్న, దుర్గాప్రసాద్, స్టాలిన్, నర్సయ్య, జానకిరాములు, బన్ని ఉన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న నగేష్

## గీతకార్మికులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న వీరస్వామి

**నల్లగొండ :** గీతకార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం వేయి కోట్ల రూపాయలతో సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని గీత పనివారల సంఘం రాష్ట్ర నాయకుడు పబ్బు వీరస్వామి కోరారు. బుధవారం నల్లగొండ సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గీత కార్మికులు ప్రమాదవశాత్తు చెట్ల పైనుంచి పడితే మెడికల్ సర్టిఫికెట్ ద్వారానే పర్మినెంట్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ గీతకార్మికులు చెట్టు ఎక్కేందుకు యంత్రాలను అందజేయాలని అన్నారు. తాటి, ఈత వనాలపై గీతకార్మిక సొసైటీలకు చెట్ల పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. చింతపల్లి పుల్లయ్య, కుంభం జయరాములు, వనం వెంకన్న, ఎరుకల నిరంజన్, ధోతి పాండరి, బి వెంకన్న పాల్గొన్నారు.

### ఘనంగా అయ్యప్ప పడిపూజ

**కొండమల్లేపల్లి:** కొండమల్లేపల్లి మండల కేంద్రంలో జెడ్పీటీసీ సలహాదారుడు పస్నూరి యుగేందర్‌రెడ్డి నివాసంలో మంగళవారం రాత్రి అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

# వినియోగంలోకి రాని ఎమ్మార్సీ భవనం

- ప్రారంభించి మూడేళ్లు
- కార్యకలాపాలు సాగించకపోవడంతో కస్తూర్బా పాఠశాల తరగతుల నిర్వహణ

**అడవిదేవులపల్లి:** అడవిదేవులపల్లి మండల కేంద్రంలో నిర్మించిన మండల వనరుల కేంద్రం (ఎమ్మార్సీ) భవనం నిరుపయోగంగా మారింది. భవనం ప్రారంభించి మూడేళ్ల గడుస్తున్నా వినియోగంలోకి రాకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

**రూ.31లక్షల వ్యయంతో నిర్మాణం**

మండల కేంద్రంలో రూ.31లక్షల వ్యయంతో నిర్మించిన ఎమ్మార్సీ భవనాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి 2021లో ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు అది నిరుపయోగంగా మారింది. ఈ భవనంలో నేటి వరకూ కార్యకలాపాలు చేపట్టలేదు. భవనం వృథాగా ఉండటంతో ప్రస్తుతం కస్తూర్బాగాంధీ విద్యార్థినులకు తరగతులు నిర్వహిస్తున్నారు.



ఎమ్మార్సీ భవనంలో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ పాఠశాల తరగతులు

**పర్యవేక్షణ కరువు..**

ఎమ్మార్సీ భవనంలో అధికారిక కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో మండలంలోని పాఠశాలల పర్యవేక్షణ సక్రమంగా జరగడం లేదు. మండలంలో ప్రాథమిక పాఠశాలలు 14, ప్రాథమికోన్నత పాఠశాలలు 4, ఒకటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయం ఉంది. ఆయా పాఠశాలల్లో 1465 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా 60 మంది ఉపాధ్యాయులున్నారు. పాఠశాలలకు సంబంధించిన వివిధ రికార్డులు కోసం దామరచర్లకు వెళ్లాల్సి వస్తుంది. తక్షణమే ఎమ్మార్సీ భవనం పూర్తి చేసి, సంబంధిత కార్యకలాపాలను ప్రారంభించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

**వినియోగంలోకి తీసుకురావాలి**



గత ప్రభుత్వం హయంలో భవనాన్ని ప్రారంభించారు. కానీ ప్రారంభం కాకపోవడంతో దామరచర్ల మండలానికి వెళ్లాల్సి వస్తుంది. దీంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకువస్తే ఉపాధ్యాయులకు మేలు జరుగుతుంది.

– పసుల కాశీ యాదవ్, ప్రధానోపాధ్యాయుడు, జిలకరకుంటతండా పాఠశాల

### మృతులకు నివాళి

**చింతపల్లి:** మండల పరిధిలోని తీదేడు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు రెడ్డి సైదులు ముదిరాజ్ తల్లి మంగమ్మ, దేన్యతండా గ్రామానికి చెందిన రమావత్ మాక్యనాయక్ తండ్రి రమావత్ దేవోజి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. వీరి మృతదేహాలను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌లు సందర్శించి, నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, గోవర్ధనాచారి, పాపయ్య, పురుషోత్తం రెడ్డి, తిరుపతయ్య, శ్రీను, రవి, బాష తదితరులున్నారు.



మంగమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

# యథేచ్ఛగా మట్టి దందా!

- మొల్కపట్నం శివారు నుంచి అనుమతులు లేకుండా మట్టి తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు

**వేములపల్లి:** మండలంలోని మొల్కపట్నం గ్రామ శివారులో గల సమీప పొలాల నుంచి అనుమతులు లేకుండా కొందరు అక్రమార్కులు మట్టిని తరలిస్తూ లక్షల రూపాయలు గడిస్తున్నారు. దీనిని సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు యథేచ్ఛగా మట్టి దందా సాగిస్తున్నారు. గ్రామ శివారులోని రైతులు తమ పొలాలను లేవల్ చేసుకుంటున్నారు. ఇది గుర్తించిన అక్రమార్కులు రైతులకు ఎలాంటి సొమ్ము చెల్లించకుండా జేసీబీల సాయంతో టిప్పర్లలో మట్టిని ఆయా ప్రాంతాలకు తరలిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ట్రిప్పుకు రూ.4,500 నుంచి రూ.5వేల చొప్పున రోజుకు 30 నుంచి 40 ట్రిప్పులను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. నూతన భవన నిర్మాణాలకు, రోడ్ల నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అవసరమయ్యే వెంచర్ల పనుల నిమిత్తం ఈ మట్టిని తరలిస్తున్నారు. వ్యవసాయ భూముల్లో సైతం మట్టిని తరలించేందుకు అనుమతులు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులు ముట్టచెప్పిన మామూళ్ల కారణంగా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత మైనింగ్‌శాఖల అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలను జరిపే వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



జేసీబీ సాయంతో టిప్పర్ ద్వారా తరలిస్తున్న మట్టి